శ్రీకృష్ణపై దాడికి నిరసనగా కొనసాగిన ఆందోళనలు



లేపాక్షిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న పాత్రికేయులు, విపక్ష నాయకులు





వైసీపీ మూకను అరెస్టు చేయాలని పుట్టపర్తిలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

నిరసనల హోరు..

పుట్టపర్తి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడు సీఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు విచక్షణారహితంగా దాడి చేయడంపై నిరసనలు హోరెత్తాయి. మంగళవారం రెండోరోజు జిల్లావ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలతోపాటు టీడీపీ, జనసేన, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, ప్రజా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, ధర్నాలు చేపట్టారు. ప్రజాస్వామ్యంలో చీకటి రోజు అంటూ రాప్తాడు ఘటనపై తీవ్రంగా ఖండించారు. నంబుల పూలకుంట, తనకల్లు, గాండ్లపెంట, ఓబుళదేవరచెరువు, నల్లమాడ, చెన్నేకొత్తపల్లి, బత్తలపల్లి, లేపాక్షి, చిలమత్తూరు, గుడిబండలో జర్నలిస్టు సంఘాలు విపక్షాలు, విద్యార్థి, ప్రజాసంఘాలు ప్లకార్డులు చేతబట్టి, రోడెక్కి నిరసన తెలిపారు. వారు మట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి వచ్చాక జర్నలిస్టులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే దాడులు చేయడం పరిపాటిగా మారిందని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. సీఎం జగన్ సభలోనే వైసీపీ అల్లరి మూకలు.. స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌ను చుట్టుముట్టి విచక్షణారహితంగా కాళ్లతో తన్నడం చూస్తుంటే హత్య కుట్ర అని స్పష్టమవుతోందన్నారు. జర్నలిస్టులపై దాడులు అరికట్టకపోతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. శ్రీకృష్ణపై దాడి చేసి వైసీపీ అల్లరి మూకలపై తక్షణమే కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దాడులకు సీఎం జగన్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్టులు... ప్రజాసంఘాలు.. రాజకీయ పార్టీల ర్యాలీలు
సీఎం బాధ్యత వహించాలని డిమాండ్



తనకల్లులో రాస్తారోకో చేస్తున్న విలేకరులు, విపక్ష నాయకులు

న్యాయం చేయాలి

పుట్టపర్తిరూరల్: రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ బెస్త శ్రీకృష్ణపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి, ఆయనకు న్యాయం చేయాలని బెస్తసేవాసంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం భీష్మఏకాదశిని పురస్కరించుకుని వారు పట్టణంలో బెస్త కులగురువు భీష్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘననివాళులు అర్పించారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జ్యోతి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. బెస్త శ్రీకృష్ణపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేసి, శ్రీకృష్ణకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ మాధవరెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం బయటకు వచ్చిన వారు మాట్లాడుతూ.. శ్రీకృష్ణపై కర్రలతో అమానుషంగా దాడిచేయడం హీనమైన చర్య అన్నారు. పట్టపగలు ఇంతదారుణంగా జర్నలిస్టుపై దాడులు చేయడం చూస్తుంటే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం అపహాస్యమవుతోందన్నారు. ఇంతటి దారుణానికి ఒడిగట్టిన వారిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో బెస్తసంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బెస్త చలపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ జ్యోతిప్రసాద్, నేతలు వెంకటేసు, రాజశేఖర్, బెస్త జైసాయి, కేశవ, సాయిరాం, రవికుమార్, గురుశేఖర్, ప్రతాప్, అనిల్, రవి పాల్గొన్నారు.





జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బెస్తసేవాసంఘం నాయకులు

వైసీపీ ఉన్మాదం

టీడీపీలో చేరికలను ఓర్వలేక కుయుక్తులు
పథకాలు తీసేస్తామంటూ బెదిరింపులు
ఫ్లెక్సీలు కోసేసి పైశాచిక ఆనందం



ధర్మవరంలో వైసీపీ దుండగులు కోసేసిన ఫ్లెక్సీలు

ధర్మవరం, ఫిబ్రవరి 20: నియోజకవర్గంలో వైసీపీ మూకలు ఉన్మాదాన్ని ప్రదర్శిస్తున్నాయి. పార్టీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొనడంతో నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరుతున్నారు. దీనిని అధికార పార్టీ మూకలు జీర్ణించుకోలేకపోతున్నాయి. టీడీపీలోకి చేరితే పథకాలను కట్ చేస్తామంటూ బెదిరిస్తున్నాయి. చేతనైంది చేసుకోండనీ, టీడీపీలోకి చేరే తీరతామంటూ వైసీపీ నాయకులు తెగేసి చెబుతున్నారు. ఆ మేరకు టీడీపీలో చేరిపోతున్నారు కూడా. దీనిపై వైసీపీ మూకలు అక్కసు వెళ్లగక్కుతున్నాయి. వారిని అడ్డుకోవడం చేతకాక, టీడీపీలో చేరికలకు సంబంధించిన ఫ్లెక్సీలపై పడుతున్నారు. ఫ్లెక్సీలను చించేస్తున్నారు. చేరికలకు సంబంధించి ఫ్లెక్సీలు కట్టిన వారి ముఖాలు కనబడకుండా కత్తిరించి, పైశాచిక ఆనందానికి తెరలేపుతున్నారు.

మీ పథకాలు వద్దు..

టీడీపీలోకి చేరుతున్న వారిపై వైసీపీ మూకలు బెదిరింపులకు దిగుతున్నాయి. 'మా పార్టీ ఇంకా అధికారంలో ఉంది. టీడీపీలోకి ఎలా చేరుతారో చూస్తాం. వచ్చే నెలలో మీకొస్తున్న పథకాలు రాకుండా చేస్తామం'టూ బెదిరిస్తున్నారు. కొందరైతే నేరుగా వారి ముఖానే వైసీపీకి రాంరాం అని చెప్పేస్తున్నారు. 'మీ పథకాలు వద్దు.. అవసరమైతే పీకేసుకోండం'టూ ఎదురు తిరుగుతున్నారు. కొందరు పేదలు మాత్రం తమకు ఎక్కడ పథకాలు పీకేస్తారోనన్న భయంతో టీడీపీలోకి చేరడానికి ఆసక్తి ఉన్నా.. సమయం కోసం ఎదురు చూస్తున్నారు. తాజాగా రెండ్రోజుల క్రితం మున్సిపల్ మాజీ చైర్మన్ బీరే గోపాలక్రిష్ణ, చేనేత ప్రముఖుడు పల్లెం క్రిష్ణతోపాటు వంద కుటుంబాలు పరిటాల శ్రీరామ్ సమక్షంలో టీడీపీలోకి చేరాయి. పట్టణంలోని 38వ వార్డు నుంచి ఇందులో చేరినవారు ఉన్నారు. దీనిని ఆ వార్డుకు చెందిన వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. పార్టీలోకి చేరిన వారి ఇళ్ల వద్దకు వెళ్లి బెదిరించినట్లు టీడీపీ వర్గాల ద్వారా తెలుస్తోంది. అంతటితో ఆగకుండా వారు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీల్లో ముఖాలు కనిపించకుండా వైసీపీ మూకలు కోసేశారు.

ఇలా కూడా.. కేసులు కడతారా..?

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్నందుకు టీడీపీ నాయకులపై కేసులు
30 యాక్ట్ ఉల్లంఘించారంటూ నమోదు
పోలీసు రిపోర్టు చూస్తే.. ముక్కున వేలేసుకోవాల్సిందే..



ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకుంటున్న టీడీపీ నాయకులు (ఫైల్)

హిందూపురం, ఫిబ్రవరి 20: నేరాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడం సహజం. నేరాన్ని అడ్డుకున్నా కూడా వైసీపీ పాలనలో కేసులు పెట్టడం సర్వసాధారణమైంది. జిల్లాలో ఎక్కడా ఇసుక రీచ్‌కు అనుమతులు ఇవ్వలేదు. అయినా అధికార పార్టీ అండతో హిందూపురం మండలం కిరికెర పంచాయతీ అప్పలకుంట వద్ద పెన్నా నది నుంచి రాత్రింబవళ్లు ఇసుక తవ్వి, అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఏకంగా ఎక్స్‌కవేటర్ల సాయంతో తవ్వి, టిప్పర్ల ద్వారా దర్జాగా ఇసుకను తరలిస్తున్నారు. ఇది అక్రమమనీ, కర్ణాటకకు తరలిపోతోందనీ, వీటిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు.. అధికారులను కోరారు. ఈనెల 5న హిందూపురం రూరల్ మండల నాయకులు పెన్నానదిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్, ఎక్స్‌కవేటర్లను అడ్డుకుని, బయటకు పంపించారు. దీనిపై కొన్నిరోజులు స్తబ్దుగా ఉన్న పోలీసులు ఆరుగురితోపాటు మరికొంతమందిపై కేసు నమోదు చేసిన విషయం మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఇందులో మొదటిపేరు మాజీ సర్పంచ్ హెచ్ఎన్ రాము, బాచి, మాజీ జడ్పీటీసీ ఆదినారాయణ, బేవనహళ్లి ఆనంద్‌కుమార్, కిరికెర అంజి, పట్టణాధ్యక్షుడు రమేష్‌తోపాటు మరికొంతమందిపై కేసు నమోదు చేశారు. దీంతో టీడీపీ నాయకులు అవాక్కయ్యారు. ఇసుకను అక్రమంగా కర్ణాటకకు తరలిస్తుంటే దానిని అడ్డుకున్నందుకు తమపైనే కేసులు కట్టడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఎక్కడా ఇసుక రీచ్ లేదని సంబంధిత అధికారులే చెబుతున్నారు. అయినా దర్జాగా నదీ పరివాహక ప్రాంతాల నుంచి టిప్పర్లలో కర్ణాటకకు ఇసుక తరలిస్తున్నారు. సామాన్యులకు ఇసుక దొరకట్లేదు. అక్రమంగా తరలించడానికి అధికార పార్టీ నాయకులు మాత్రం పోటీ పడుతున్నారు. వాటిని అడ్డుకుంటే తమపైనే కేసు పెట్టడం ఏంటని టీడీపీ నాయకులు వాపోతున్నారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామనీ, తప్పుడు కేసులు పెట్టిన పోలీసులపై కోర్టులోనే తేల్చుకుంటామంటున్నారు.

30 యాక్ట్‌ను ఉల్లంఘించినందుకే...

హిందూపురం రూరల్ మండలంలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉండగా.. ఈనెల 5న టీడీపీ నాయకులు గుంపుగా వెళ్లి పెన్నానది వద్ద వాహనాలను అడ్డుకున్నారనీ, దీంతో నిబంధనలు ఉల్లంఘించారని కేసు నమోదు చేశామని హిందూపురం అప్‌గ్రేడ్ సీఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. అదే పోలీసు స్టేషన్‌లో పనిచేసే శ్రీనివాసులు అనే కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎఫ్ఐఆర్ కాపీలో ఉంది. ఇందులో కానిస్టేబుల్ ఏమని పేర్కొన్నారంటే ' ఈనెల 5న అప్పలకుంట విధి నిర్వహణలో ఉన్నా. పెన్నానదిలో ప్రభుత్వం అనుమతులు ఇచ్చిన ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రీచ్ నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను, అక్కడ పనిచేస్తున్న కూలీలను టీడీపీ కార్యకర్తలు గుంపుగా వచ్చి అడ్డుకున్నారు. ఇసుక రవాణాను ఆపాలని నినాదాలు చేశారు. ఇక్కడ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందనీ, గుంపుగా నినాదాలు చేయకూడదని నాయకులకు చెప్పినా లెక్కచేయలేదు. ట్రాక్టర్‌ను అడ్డుకుని ఇసుక రవాణా ఆపాలని నినాదాలు చేశారు. ఇంతలో ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయగా.. వారు వస్తున్నారని గమనించి టీడీపీ కార్యకర్తలు అక్కడి నుంచి వెళ్లిపోయారనీ, ఇదే విషయాన్ని స్పెషల్ రిపోర్ట్ ద్వారా తెలియజేసుకుంటున్నాన'ని కానిస్టేబుల్ చెప్పడం గమనార్హం. ఎందుకంటే ఆ రోజు టీడీపీ నాయకులు అడ్డుకున్నది ఎక్స్‌కవేటర్, టిప్పర్లను మాత్రమే. వారు ట్రాక్టర్లను అడ్డుకున్నది లేదు. ఆ ప్రాంతంలో అసలు ట్రాక్టరే లేదు. ఈ నేపథ్యంలో కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే.

పాత్రికేయుల తరఫున పోరాడుతాం



కదిరి, ఫిబ్రవరి 20: పాత్రికేయులపై దాడులు చేస్తే వారి తరఫున పోరాడుతామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక తన నివాసంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సిద్ధం సభను కవర్ చేయడానికి వెళ్లిన ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. కదిరి నియోజకవర్గంలో కూడా దాడులు చేస్తామని కొంతమంది చెబుతున్నారనీ, ఆ పరిస్థితే వస్తే టీడీపీ.. పాత్రికేయులకంటే ముందుంటుందన్నారు. వారి తరఫున పోరాడుతామన్నారు.

416 మందికి లబ్ధి

పుట్టపర్తి, ఫిబ్రవరి 20: జిల్లాలో కొత్తగా పెళ్లి చేసుకున్న 416 మందికి కల్యాణమస్తు, షాదీ తోఫా కింద రూ.3.10 కోట్ల లబ్ధి చేకూర్చారు. అందుకు సంబంధించిన మెగా చెక్కును స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. 2023లో వివాహం చేసుకున్న వారికి ఆర్థికలబ్ధి నేరుగా వారి ఖాతాల్లోకి జమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖాధికారి శివరంగప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, ఫిబ్రవరి 20: ఇండియన్ ఆర్మీలో చేరేందుకు అర్హులైన యువకులు మార్చి 22వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి (డీఈఓ) మీనాక్షి మంగళవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు రూ.250 చలానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఫేజ్-1 కింద కంప్యూటర్ బెస్ట్ ఆన్‌లైన్ పరీక్ష ఉంటుందనీ, పేజ్-2లో రిక్రూట్‌మెంట్ ర్యాలీలో అర్హత సాధించాల్సి ఉంటుందన్నారు. www.joinindiaarmy.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 08632230006 నంబరులో సంప్రదించాలని డీఈఓ సూచించారు.



చౌటకుంటపల్లిలో తీవ్ర నీటి ఎద్దడి

పశువుల నీరే గతి..!

ఈ ఫొటో చూశారా..! పశువుల తాగునీటి తొట్టి. చుట్టూ బురదమయం. నడవడానికి కూడా ఇబ్బందే. తొట్టిలో కూడా నీరు పాచిపట్టింది. ఆ నీటిని పశువులకు తాపిస్తున్నారు. తొట్టె గోడలపై బిందెలు కూడా ఉన్నాయి. ఇవెందుకనుకుంటున్నారా? నీటిని తీసుకోవడానికే.. తొట్టిలోని నీటిని తీసుకెళ్లపోవడానికే. పశువుల కోసమేమోలే అనుకుంటే పొరబాటే. కాదు.. కాదు.. మనుషుల కోసం. ఇంటి అవసరాల కోసం. పాచిపట్టి, బ్యాక్టీరియా నిండిన నీటితోనే స్నానం చేయాల్సిన దుస్థితి. ఇది నల్లమాడ మండలంలోని చౌటకుంటపల్లి వాసుల దయనీయ స్థితి. గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. చుక్క నీరు చిక్కే అవకాశం లేదు. దీంతో పశువుల నీటి తొట్టికి వదిలిన నీటినే తెచ్చుకుని గ్రామస్థులు వాడుకోవాల్సిన దుస్థితి. నెలన్నరగా సమస్య నెలకొంది. పాలకులు, అధికారులకు పదేపదే విన్నవించినా.. పట్టించుకున్న పాపానపోలేదని గ్రామస్థులు వాపోతున్నారు.

నెలన్నర నుంచి సమస్య.. పట్టించుకోని పాలకులు, అధికారులు



నల్లమాడ, ఫిబ్రవరి 20: మండలంలోని చౌటకుంటపల్లిలో వేసవి రాకనే నీటికి ఇబ్బందిగా మారింది. గుక్కెడు నీటి కోసం గ్రామస్థులు పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామ శివారు ప్రాంతంలో పశువుల దాహార్తి తీర్చడానికి గతంలో ఏర్పాటు చేసిన నీటితొట్టిలోని నీరే దిక్కవుతోంది. గ్రామంలో 400 కుటుంబాలున్నాయి. నెలన్నర నుంచి నీటి సమస్య నెలకొంది. గ్రామ సమీపంలోని పశువుల నీటి తొట్టి నుంచి బిందెలతో తెచ్చుకోవాల్సి వస్తోంది. పశువుల దాహార్తితోపాటు గ్రామస్థుల అవసరాలను కూడా నీటి తొట్టి తీర్చుతోంది. ఆ తొట్టి సమీపంలోనే పంచాయతీ బోరుబావి ఉంది. ఈ బావిలో ఒక టిన్నర ఇంచునీరు వస్తోంది. ఆ నీటిని పంచాయతీ పాలకులు వదలకపోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. గ్రామంలోకి వచ్చే పైప్ లైన్ తొలగించి, పశువుల తొట్టిలోకి ఏర్పాటు చేశారు. ఈ నీటినే గ్రామస్థులు తెచ్చుకుంటున్నారు. గ్రామంలో నాలుగు బోర్లున్నాయి. రెండింట్లో నీరు రాలేదు. గ్రామానికి దూరంగా ఒక బోరు ఉంది. దాని నుంచి అరకొరగా నీరు వస్తోంది. ఆ నీరు ఎస్సీ కాలనీ వరకే అందుతోంది. మరో బోరు నుంచి పశువుల నీటి తొట్టిలోకి కనెక్షన్ ఇచ్చారు. ఈ విషయాన్ని గ్రామస్థులు.. పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకున్న పాపానపోలేదు. నీటి సంపులున్నవారు ట్యాంకర్‌కు రూ.600 చొప్పున కొనుగోలు చేసి, నీటిని నింపుకుంటున్నారు. వ్యవసాయ బోర్ల నుంచి మరికొంతమంది తెచ్చుకుంటున్నారు. ఆర్థిక స్థోమత లేని వారు పశువుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన నీటితొట్టి నుంచి తెచ్చుకుంటున్నారు. ఈ తొట్టిలో కూడా విద్యుత్ సరఫరా ఉన్న సమయంలోనే నీరు దొరుకుతుంది. లేదంటే తొట్టిలో నిలువ ఉన్న నీటిని తెచ్చుకోవాల్సిందే. నీటి తొట్టికి దగ్గరగా ఉన్న వారికి మాత్రమే కొంతవరకు అనుకూలంగా ఉంది. అదే గ్రామం మధ్య, ఆ చివరలో ఉన్నవారి పరిస్థితి దుర్భరంగా ఉంది. మహిళలు, వృద్ధులు, గర్భిణులు నీటిని తెచ్చుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా పాలకులు, అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదని గ్రామస్థులు మండిపడుతున్నారు. రానున్న రోజుల్లో నీటి కష్టాలు ఎలా ఉంటాయోనని భయాందోళనలు చెందుతున్నారు. నీటిని వదలడానికి ఒక మనిషిని ఏర్పాటు చేసి, ఉన్న అరకొర నీటిని మెయిన్‌లైన్‌కు కనెక్షన్ ఇస్తే సగం గ్రామానికైనా నీటి సమస్య పరిష్కారం అవుతుందంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు చొరవ చూపి, గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ట్యాంకు నుంచి పైపు ద్వారా సంపులోకి నీటిని నింపుకుంటున్న దృశ్యం

పడరాని పాట్లు పడుతున్నాం



గ్రామ నడిబొడ్డున నివాసం ఉంటున్నాం. నెలన్నర నుంచి గుక్కెడు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నాం. ట్యాంకర్ రూ.600 పెట్టి కొనుగోలు చేస్తున్నాం. అధికారులు, పాలకులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలి.

- సుధాకర్‌రెడ్డి, చౌటకుంటపల్లి

ఇప్పటికైనా పరిష్కరించాలి



గ్రామ సమీపంలోని బోరుబావి నీరు ఎస్సీ కాలనీ వరకు మాత్రమే వస్తోంది. గ్రామం చివరి వరకు రావట్లేదు. దీంతో నెలన్నర నుంచి నీటికష్టాలు తీవ్రమయ్యాయి. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలి.

- నాగభూషణరెడ్డి, చౌటకుంటపల్లి

వెంటనే పరిష్కరిస్తాం

గ్రామంలో తాగునీటి సమస్య ఉన్న మాట వాస్తవమే. గ్రామానికెళ్లి పరిశీలించాం. ఇటీవలే నూతనంగా బోరు వేశాం. అందులో నీరు పడలేదు. త్వరలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- శశికళ, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్

వైసీపీ చేసిన అభివృద్ధి

శూన్యం: బీకే పార్థసారథి

రొద్దం, ఫిబ్రవరి 20: వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధి చేసింది శూన్యమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి విమర్శించారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో బీకే సెల్ఫీ చాలెంజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. 1995 నుంచి 2019 వరకు రొద్దం మండలంలో టీడీపీ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అత్యంత వెనుకబడిన మండలంలో జిల్లాపరిషత్ పాఠశాలలు, జూనియర్ కళాశాల, బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేసి, అభివృద్ధి చేశామన్నారు. ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ ఎక్కడా అభివృద్ధి చేయలేదన్నారు. టీడీపీ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే కనిపిస్తున్నాయన్నారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమే అని బీకే సవాల్ విసిరారు. వైసీపీ పనైపోయిందనీ, రెండు నెలల్లో టీడీపీ అధికారంలోకి వస్తుందనీ, చంద్రబాబు సారథ్యంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుందన్నారు. జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



జూనియర్ కళాశాల వద్ద సెల్ఫీ తీసుకుంటున్న బీకే పార్థసారథి



ఏమీ చేసుకోలేరు..!



శ్రీకృష్ణపై దాడి చేసిన దుండగుల ధీమా

- అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిన వైసీపీ గూండాలు
- పట్టుకోండి చూద్దాం అంటూ పోలీసులకు దుండగుల సవాల్
- మిద్దె ఎర్రిస్వామిని అరెస్టు చేసిన రాప్తాడు పోలీసులు



రాప్తాడు పోలీస్‌స్టేషన్‌లో కూర్చున్న మిద్దె ఎర్రిస్వామి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 20: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ గుండాల్లో చాలామంది అండర్‌గ్రౌండ్‌కు వెళ్లిపోయారు. మరికొందరు స్వగ్రామాల్లోనే తిరుగుతూ.. 'మమ్మల్ని ఎవరూ ఏమీ చేసుకోలేరు..' అని బీరాలు పలుకుతున్నారు. రాప్తాడు సమీపంలో ఆదివారం జరిగిన వైసీపీ సిద్ధం సభలో వైసీపీ రౌడీమూకలు శ్రీకృష్ణపై పాశవిక దాడికి పాల్పడ్డాయి. దీనిపై రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. జర్నలిస్టు, ప్రజా సంఘాలు, విపక్షాలు అనంతపురం జిల్లా పోలీసు కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన కు దిగాయి. ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని విన్నవించాయి. ఈ నేపథ్యంలో మూ కలో కొందరు పారిపోగా.. మరి కొందరు వైసీపీ నేతల అండతో అండర్‌గ్రౌండ్‌కు వెళ్లి పోయారు. కూడేరు మండలం మరుట్ల రెండో కాలనీకి చెందిన మిద్దె ఎర్రిస్వామిని రాప్తాడు పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. రౌడీల గుంపులో కీలకంగా వ్యవహరించిన మిద్దె ఎర్రిస్వామి అతని స్వగ్రామంలోనే అదుపులోకి తీసుకున్నా రు. మధ్యాహ్నం 12.20 గంటలకు రాప్తాడు పోలీస్‌స్టేషన్‌కు జీపులో తీసుకొచ్చారు. ఆ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మె ల్యే విశ్వేశ్వరరెడ్డి అనుచరులు రాప్తాడు పోలీస్ స్టేషన్ వద్ద ఉదయం నుంచి రాత్రి వరకు పడిగాపులు కాశారు. అతన్ని తమతో బ యటకు తీసుకెళ్లేందుకు విశ్వప్రయత్నాలు చేశారు.



రాప్తాడు పోలీస్ స్టేషన్ వద్ద ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి స్టిక్కర్ ఉన్న స్కార్పియో వాహనం

పరారీలో అశోక్..



కురుబ నాగేంద్ర



అశోక్

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని దొడఘట్టకు చెందిన గొల్ల అశోక్ కోసం స్థానిక పోలీసులు మంగళవారం అతని ఇంటికెళ్లారు. అప్పటికే పరారయ్యాడు. దీంతో ఇంటి వద్ద ఉన్న అతని బైక్‌ను ట్రాక్టర్‌లోకి ఎక్కించి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అశోక్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రౌడీ మూకలో మరో వ్యక్తి, కళ్యాణదుర్గం మండలం బోయలపల్లికి చెందిన కురుబ నాగేంద్ర. ఇతను అదే గ్రామంలోనే కర్ణాటక మద్యం తీసుకొచ్చి విక్రయిస్తుంటాడు. ఇతనిపై సెబ్ పోలీసులు గతంలో కేసులు నమోదు చేసినట్లు సమాచారం. దాడి చేసిన తరువాత గ్రామంలోనే ఉంటున్నాడు. మద్యం సేవించి ఊళ్లో తిరుగుతూ.. తనను ఎవరూ ఏమీ చేసుకోలేరని బీరాలు పలుకుతున్నాడని స్థానికులు అంటున్నారు. ఈ విషయం పోలీసులకు తెలుసా..? చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఎమ్మెల్యే ఇంటి వద్ద ఉన్నా..



బండి రవి

శ్రీకృష్ణపై కర్రతో దాడికి పాల్పడి, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న బండి రవి ఊరి నుంచి పారిపోయి.. బయట బయటే తిరుగుతున్నాడు. అతన్ని అదుపులోకి తీసుకునేందుకు కనగానపల్లి మండలం కోనాపురం గ్రామానికి మంగళవారం పోలీసులు వెళ్లారు. ఇంటివద్ద లేకపోవడంతో ఫోన్ చేశారు. 'నేను ఊళ్లో లేను.. అనంతపురంలో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి ఇంటివద్ద ఉన్నా. కావాలంటే లొకేషన్ పంపుతా చూడండి..' అని పోలీసులతో అన్నట్లు సమాచారం. పోలీసులకు లొకేషన్ కూడా పంపాడని తెలిసింది. వైసీపీ రాప్తాడు నియోజకవర్గ నేతలు బండి రవికి పూర్తిస్థాయి సహకారం అందిస్తున్నారనేందుకు ఇది నిదర్శనం. ఇక టోపీ, కళ్లద్దాలు పెట్టుకుని శ్రీకృష్ణపై పిడిగుద్దులు గుద్దిన రౌడీతోపాటు దాడిలో పాల్గొన్న మరికొందరు పరారీలో ఉన్నారు.

సీరియస్‌గా తీసుకుంటారా..?

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి జరిగి మూడు రోజులు గడిచింది. దాడికి పాల్పడ్డవారు ఎవరో సామాన్యులు కూడా చెప్పగలుగుతున్నారు. 'మా ఊరివాడే.. వెధవ పనులు చేస్తుండా.. రౌడీ..' అని వాపోతున్నారు. వీడియో ఆధారాలు ఉన్నా, పోలీసులు పట్టుకోకుండా అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అందరినీ అదుపులోకి తీసుకుంటారా..? లేకే అధికార పార్టీ వారి ఒత్తిళ్లకు తలొగ్గి వదిలేస్తారా అన్న చర్చ జనంలో జరుగుతోంది. ఇప్పటి వరకూ మిద్దె ఎర్రిస్వామిని మాత్రమే అదుపులోకి తీసుకున్నారు. అశోక్ ఆచూకీ లభించలేదని అంటున్నారు. బోయలపల్లికి చెందిన నాగేంద్ర ఊరిలోనే ఉన్నాడని స్థానికులు చెబుతున్నారు. అయినా పోలీసులు అరెస్టు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది. రాప్తాడు నియోజకవర్గానికి చెందిన బండి రవికి అండగా ఉన్నది ఎవరో పోలీసులకు, ప్రజలకు స్పష్టంగా తెలుసు. ఎక్కడ దొరుకుతాడో కూడా తెలుసు. పట్టుకుంటారా.. వదిలేస్తారా.. తేలాల్సి ఉంది.

రేపు చలో అనంతపురం

- శ్రీకృష్ణపై వైసీపీ నేతల దాడికి నిరసనగా ర్యాలీ, ధర్నా
- జిల్లాకు రానున్న జర్నలిస్టు సంఘాల రాష్ట్ర నేతలు
- ప్రజాస్వామికవాదులు మద్దతుగా తరలిరావాలని పిలుపు
- జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టమే ప్రధాన డిమాండ్

అనంతపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి నిరసనగా జర్నలిస్టు సంఘాలు 'చలో అనంతపురం' పిలుపునిచ్చాయి. దాడికి పాల్పడ్డ వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, తక్షణమే అరెస్టు చేయాలని, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలనే డిమాండ్‌తో ఈ నెల 22న చలో అనంతపురం కార్యక్రమాన్ని నిర్వహిం చాలని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘాల రాష్ట్ర నేతలు నిర్ణయించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీ సుబ్బారావు, చందు జనార్దన్, రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి, సామ్నా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మారావు, రమణారెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివ, ఫొటో జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయకులు సాంబశివరావు, రాయలసీమ జిల్లాల నుంచి జర్నలిస్టులు పెద్దఎత్తున అనంతపురానికి గురువారం తరలిరానున్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై రోజురోజుకూ దాడులు పెరిగిపోతున్నాయని జర్నలిస్టు సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దాడులను అరికట్టాల్సిన పాలకులే దాడులను ప్రో త్సహిస్తున్నారని వారు విమర్శించారు. ఇసుక అక్రమ రవాణాపై వార్త రాసినందుకు అమరావతిలో ఈనాడు రిపోర్టర్, పుట్టపర్తిలో ఈనాడు ఫొటోగ్రాఫర్, రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై అధికార వైసీపీ నేతలు దాడి చేయడం దుర్మార్గమని వారు పేర్కొన్నారు. దాడిచేసిన వారిపై ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, శ్రీకృష్ణ మీద దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22న అనంతపురంలో పెద్ద ఎత్తున నిర్వహించే నిరసన ర్యాలీ, ధర్నా కార్యక్రమానికి ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు సమీప జిల్లాల జర్నలిస్టులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. జర్నలిస్టుల ఉద్యమానికి ప్రజాస్వామికవాదులు, ఉద్యోగ, ప్రజా, కార్మిక, విద్యార్థి, యువజన సంఘాల నేతలు మద్దతివ్వాలని విన్నవించారు.

ఎన్నికలకు సన్నద్ధం కావాలి: కలెక్టర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 20: సార్వత్రిక ఎన్నికలకు అధికారులు అన్ని విధాలా సన్నద్ధం కావాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ గౌతమి ఆదేశించారు. మంగళవారం స్థానిక జేఎన్‌టీయూ ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా ఎస్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, ఎఫ్ఎస్టీ, ఎంసీసీ టీం లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎస్ఎస్టీ, వీఎస్టీ, వీవీటీ, ఎఫ్ఎస్టీ, ఎంసిసి టీంల అధికారులు కీలకంగా వ్యవహరించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన బృందాలు జిల్లా స్థాయి శిక్షణ తరువాత మార్చి మొదటి వారంలో ఆర్ఓ స్థాయిలో మరోసారి శిక్షణ ఉంటుందన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల సమయంలో అన్ని బృందాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల విధుల్లో ఉన్నామనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఎక్కడా ఎటువంటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సివిజిల్ యాప్, ఎలెక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం ఏర్పాటు తరువాత మద్యం, డబ్బు, ఇతర వస్తువులు రవాణా కాకుండా ఐటీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలు మేజర్ రోల్ ప్లే చేయాలన్నారు. ఫిర్యాదులను ఆయా స్థాయిలో ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని, ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది ఎటువంటి ప్రలోభాలకు లొంగరాదన్నారు. ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల్లో లా అండర్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా పక్కాగా అమలు చేయాలన్నారు. సిబ్బంది శిక్షణా కార్యక్రమాలతో అవగాహన పెంచుకో వాలన్నారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు సమష్టిగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

డబుల్ ఓట్ల తొలగింపులో అధికారుల నిర్లక్ష్యం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి20: ఫిర్యాదు చేసినా డబుల్ ఓట్లను తొలగించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం అవుతోంది. మండలంలోని కుణుతూరు గ్రామంలోని లేని వ్యక్తి ఓట్లు రెండు చోట్ల నమోదు కావడం విశేషం. ఇటీవల డబుల్ ఓట్ల తొలగింపునకు బీఎల్ఓలు, పార్టీల ప్రతినిధులు ఇంటింటి సర్వే చేపట్టారు. అయినా వాటిని తొలగిం చలేదు. ధర్మవరం పట్టణం దుర్గానగర్‌కు చెందిన దుర్వాశులుకు 241పోలింగ్‌బూత్‌లో సీరియల్ నెంబర్ 960లో ఓటు ఉంది. మళ్లీ కుణుతూరు గ్రామంలో 586సీరియల్ నెంబర్‌లో దుర్వాసులు పేరుమీద ఓటు వచ్చింది. ఈ వ్యక్తి గ్రామానికి సంబంధించిన వారు కాదని, డోర్ నెంబర్‌కూడా అదేగ్రామానికి చెందిన మరొకరిది పెట్టి ఓటు జాబితాలోకి చేర్చారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పట్టణంలో ఉన్న వ్యక్తికి మా గ్రామంలో ఎలా ఓటు ఎక్కిస్తారని ఆగ్రామస్థులు బీఎల్ఓలను ప్రశ్నిస్తున్నారు. అధికారులకు సరైన ఆధారాలతో నివేదికలు ఇచ్చిన మళ్లీ అవే తప్పులు చేస్తున్నారని, బీఎల్ఓల నిర్లక్ష్యంతో డబుల్ ఓట్లు వచ్చాయని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నారు.

సిద్ధం సభకు వెళ్లిన వ్యక్తి ఏమయ్యాడు?

- కుటుంబ సభ్యుల ఆందోళన



హనుమంతరాయప్ప (ఫైల్)

హిందూపురం, ఫిబ్రవరి 20: మండలంలోని గోళ్లాపురానికి చెందిన హనుమంతరాయప్ప ఈనెల 18న రాప్తాడు వద్ద జరిగిన సిద్ధం సభకు వెళ్లాడు. మంగళవారం కూడా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గత ఆదివారం వైసీపీ నాయకులు హనుమంతరాయప్పను ఇంటి నుంచి సిద్ధం సభకు తీసుకెళ్లారు. ఆ రోజు రాత్రికే అతడిని తీసుకెళ్లిన వారు ఇళ్లకు చేరుకున్నారు. కానీ హనుమంతరాయప్ప మంగళవారం కూడా ఇంటికి రాకపోవడంతో ఫిర్యాదు చేయడానికి అతడి భార్య భాగ్యమ్మ, కుమారులు హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. అతడు అదృశ్యమైంది రాప్తాడులో కాబట్టి అక్కడే ఫిర్యాదు చేయాలని అప్‌గ్రేడ్ పోలీసులు తెలుపడంతో రాప్తాడుకు వెళ్లిన ట్లు తెలిసింది. హనుమంతరాయప్ప మూగ, చెవిటి కావడంతో... ఎక్కడైనా తప్పిపోయాడా లేక ఏమయ్యాడో అని భార్య పిల్లలు ఆందోళన వ్యక్తం చేశారు.

పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

- అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 20: మూడు సంవత్సరాల పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకు పాలిసెట్-2024 దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి అర్హతగల విద్యార్థులు అర్హులని, ప్రస్తుతం పరీక్షలు రాసే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఏప్రిల్ 5వరకు https://polycetap.nic.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

రూ.8.60 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు



ఎంపికైన గౌతమి, ప్రశాంత్


కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రూ.8.60లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈఈఈ చివరి సంవత్సరం విద్యార్థి గౌతమి, ఈసీఈ చివరి సంవత్స రం ప్రశాంత్‌కుమార్ టెక్సాస్ ఇన్ స్ట్రుమెంట్ సంస్థలో ఉద్యోగాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన అభినందించారు. పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులు కళాశాలలో నిర్వహించే క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లోనే ఉద్యోగాలకు ఎంపిక అవుతారన్నారు.



కదలరంతే..!

- ఏళ్ల తరబడి పాతుకుపోయిన డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు
- మూడేళ్ల నిబంధన వీళ్లకు వర్తించదు..
- అధికార పార్టీ కనుసన్నల్లోనే విధులు..

డీఆర్‌డీఏ కార్యాలయం





అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 20: ఆ అధికారులు ఏళ్ల తరబడి సీట్లకు అతుక్కుపోయారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మూడేళ్లు పూర్తిచేసిన అధికారులను బదిలీ చేయాలని ఈసీ ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అన్ని శాఖలలో ఈ నిబంధనలు వర్తిస్తాయేమో.. డీఆర్‌డీఏ-వైకేపీ, డ్వామాలో మాత్రం వర్తించవని అందరూ చర్చించుకుంటున్నారు. ఆ ఇద్దరు అధికారులు పని చేసిన కాలం మూడున్నరేళ్ళు, నాలుగున్నరేళ్ళు అయినా వారిని కదిలించేవారు లేరు. అధికారపార్టీ నేతల కనుసన్నల్లో పని చేయడమే వారిని కదిలించకపోవడానికి కారణమని చ ర్చించుకుంటున్నారు. తమకు భజన చేసే ఉద్యోగులకు అందలం ఎక్కించడం, ప్రశ్నించే ఉద్యోగులను, దూర ప్రాంతాలకు దూరంగా బదిలీ చేసి కక్షసాధింపులకు పాల్పడుతుండడం గమనార్హం. ఈ తతంగమంతా డీఆర్‌డీఏ-వైకేపీ, డ్వామా శాఖల్లోనే జరుగుతోంది. ఇంత జరుగుతున్నా జిల్లా యంత్రాంగం తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడం శోచనీయం.

మూడున్నర... నాలుగున్నరేళ్లు...

డీఆర్‌డీఏ-వైకేపీ పీడీగా 2019 సెప్టెంబరు 9వ తేదీన జిల్లాకు వచ్చారు. నాలుగు సంవత్సరాల 7 నెలల కాలం పూర్తి కావస్తోంది. ఏడాదిగా హౌసింగ్‌కూ అదనపు బాధ్యతలు అప్పగించారు. సీనియర్ అధికారులు ఉన్నప్పటికీ కేవలం భజన, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సొంత జిల్లా కావడం, అదే సామాజికవర్గం కావడంతోనే బదిలీ చేయకుండా ఇక్కడే ఉంచారనే విమర్శలు లేకపోలేదు. డ్వామా పీడీ 2020 సెప్టెంబరు 14వ తేదీన జిల్లాకు వచ్చారు. అంటే మూడున్నర సంవత్సరాలు (మూడు సంవత్సరాల 7 నెలలు కావస్తోంది) అయినా ఇక్కడి నుంచి కదిలించరు. ఎందుకంటే ఈ ఇద్దరు అధికారులు అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే... మరీ ముఖ్యంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అత్యంత ప్రీతిపాత్రులు కావడం, ఆయన సిఫారసుతోనే ఇక్కడ పార్టీకి మైలేజ్ పెంచేందుకు పనిచేస్తుండడం గమనార్హం.

కండువా లేకున్నా.. కార్యకర్తగా...

డీఆర్‌డీఏ-వైకేపీలో కీలక అధికారి తీరు అందరినీ విస్మయానికి గురి చేస్తోంది. సీఎం జిల్లా పర్యటనకు వస్తే జిల్లా కలెక్టర్ తరువాత ఈ అధికారే ముందుంటారు. ఆశాఖలో అధికారులు, ఉద్యోగులు సైతం ఆశ్చర్యపోయేలా కండువా లేని కార్యకర్తలా అధికారపార్టీకి వంతు పాడడం గమనార్హం. గత నెలలో ఉరవకొండలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా పథకంలో సీఎం జగన్ దృష్టిలో పడేందుకు స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులను సభకు తరలించేందుకు ప్రత్యేకంగా డీఆర్‌డీఏ-వైకేపీ ఉద్యోగులకు మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

సిఫారసు తప్పనిసరి..

డీఆర్‌డీఏ-వైకేపీలో ప్రతి పనికి ఓ రేటు కడుతున్నారు. లేదంటే అధికారపార్టీకి చెందిన సిఫారసు లేఖ ఉండాల్సిందే. లేదంటే ఆ పని జరగదని చర్చలు వినిపిస్తున్నాయి. బదిలీ నుంచి టెండర్లు, వర్కులు, పింఛన్లు ఇలా ఏది చేసినా రేటు, సిఫారసు లేఖ ఉంటేనే పని జరుగుతుంది. వీటిలో రెండూ లేకపోతే డీఆర్‌డీఏ-వైకేపీ కార్యాలయం మెట్లు సైతం ఎక్కడానికి అర్హత లేని పరిస్థితి. ఉద్యోగుల బదిలీల విషయంలో ఓ నియోజకవర్గానికి వెళ్లాలన్నా ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే లేదా ఇన్‌చార్జి సిఫారసు లేఖ తేవాల్సిందేనని సూచిస్తూ అధికార పార్టీపై భక్తిని చాటుకుంటున్నారు.

స్ట్రాంగ్ రూం పరిశీలించిన కలెక్టర్

తాడిపత్రి, ఫిబ్రవరి20: రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూంను కలెక్టర్ గౌతమి మంగళ వారం పరిశీలించారు. పట్టణ సమీపంలోని డిగ్రీ కళాశాలలో ఉన్న గదులను పరిశీలించి స్ట్రాంగ్ రూం అవసరమైన గదిని ఎంపికచేసి పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఎస్పీ గంగయ్య, మున్సిపల్ కమిషనర్ రవి, తహసీల్దార్ ఆంజనేయులు ఉన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ

కూడేరు, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలతోపాటు ప్రాథమిక పాఠశాలను డీఈఓ వరలక్ష్మి తనిఖీ చేశారు. మంగళవారం తనిఖీకి వచ్చిన డీఈఓ విద్యార్థులతో విద్యా గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఆర్‌సీ సెంటర్‌ను తనిఖీ చేసి ఎంఈఓ-2 సాయికృష్ణతో వివరాలను అడిగి తెలుసుకున్నారు.

చిరుత దాడిలో గేదె మృతి

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 20: మండలంలోని పాల వెంకటాపురం గ్రామంలో చిరుత దాడి చేయడంతో ఓ గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన గొల్ల చిత్తప్ప అనే రైతుకు చెందిన గేదెపై సోమవారం అర్ధరాత్రి చిరుత దాడి చేసింది. గేదె మృతి చెందడంతో సుమారు రూ. 20 వేలు నష్టం కలిగినట్లు రైతు వాపోయారు. గతంలో కూడా చిరుతదాడిలో మేకలు, గేదెలు మృతి చెందాయని ఫారెస్ట్ అధికారులకు తెలియజేసినా వారు స్పందించడం లేదని పలువురు రైతులు వాపోయారు.

26న కాంగ్రెస్ బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న శైలజానాథ్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి20: జిల్లా కేంద్రంలో ఈనెల 26న నిర్వహించే కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభను జయప్రదంచేయాలని మాజీ పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్ నాయకులకు సూచించారు. మంగళవారం జిల్లాలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో పర్యటించి స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి సభ ఏర్పాట్లపై చర్చించినట్లు తెలిపారు. సాయంత్రం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి సభకు సంబంధించి చేపట్టాల్సిన అంశాలపై దిశ నిర్దేశం చేశారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు దాదాగాంధీ, జిల్లా అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు వాసు, రవికృప రామానాయుడు, నాయకులు ఇమామ్, శర్మాస్, కొండారెడ్డి, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఓబులేసు పాల్గొన్నారు.

హోరెత్తిన నిరసనలు

ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పాత్రికేయులు, విపక్ష నాయకుల డిమాండ్

తనకల్లు, ఫిబ్రవరి 20: రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి నిరసనగా మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. మండలకేంద్రంలోని విలేకరులు, విపక్షాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ సర్కిల్‌లో జాతీయ రహదారి 44న బైఠాయించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ దాడి చేసిన వైసీపీ అల్లరి మూకలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో విలేకర్లపై దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొన్న సభలో విలేకరులకు రక్షణ లేకపోతే సామాన్యులకు ఎలా ఉంటుందని ప్రశ్నించారు. నిజాలను నిర్భయంగా వెలుగులోకి తెస్తున్న విలేకరుల గొంతు నొక్కాలని వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు. దాడులకు పాల్పడినవారిని వెంటనే గుర్తించి, అరెస్టు చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి దాడులు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు. దాడులకు పాల్పడేహక్కు ఎవరికీ లేదన్నారు. రాస్తారోకోతో రోడ్డుకిరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచాయి. ఎస్ఐ ధరణీబాబు, ఏఎస్ఐ నరసింహులు, సిబ్బంది రాస్తారోకో చేస్తున్నవారికి నచ్చచెప్పి, ఆందోళన విరమింపచేశారు. అనంతరం నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద విలేకరులు, విపక్ష నాయకులు నిరసన తెలిపారు. వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారి స్వామికి అందించారు. నిరసనలో టీడీపీ మండల కన్వీనర్ రెడ్డి శేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాజారెడ్డి, శంకర్‌నాయుడు, మహబూబ్‌బాషా, నాగేంద్రప్రసాద్, తోట సరోజమ్మ, మాజీ ఎంపీటీసీ రమణయ్య, పిజీ మల్లికార్జున, శ్రీరాములనాయక్, సోంపాళ్యం నాగభూషణం, జనసేన బాలసముద్రం ఎంపీటీసీ అమర్‌కార్తికేయ, సీపీఎం శివన్న, సీపీఐ రెడ్డెప్ప, కాంగ్రెస్ పారేసు, రైతు సంఘం రమణ, డిఎస్ఎస్ చిన్నప్ప, గిరిజనపోరాట సమితి నాయకులు ప్రసాద్‌నాయక్, ఉత్తన్న నాయక్, సీఐటీయూ వేమన్న, నాయకులు శ్రీరాములనాయక్, చంద్రప్ప, కిషోర్, ప్రసాద్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వైసీపీ అల్లరిమూకలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పాత్రికేయులు, విపక్షం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిరసనలు చేపట్టారు. అవినీతి, అక్రమాలను బయటపెడితే దాడులకు పాల్పడతారా..? అంటూ ప్రశ్నించారు. విలేకరులతో రక్షణలేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు, విపక్షం నాయకులు

నల్లమాడ: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషమని టీడీపీ మండల కన్వీనర్ షైలే శివశంకర్, ఆర్ఎంపీ వైద్యులు బుట్టి నాగభూషణనాయుడు పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జర్నలిస్టులు, విపక్షం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సిద్ధం సభలో వైసీపీ రౌడీ మూకలు విచక్షణరహితంగా దాడి చేశారన్నారు. దాడిచేసినవారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పాత్రికేసులు మహమ్మద్‌వలీ, గంగులయ్య, టీడీపీ నాయకులు పుట్టా రవీంద్ర, మంజునాథ్‌రెడ్డి, పల్లపు శ్రీరాములు, అరవిందకుమార్, పల్లపు సాయికుమార్, పాపారాయుడు, కిరణ్‌కుమార్, సాయికుమార్, క్రిష్టప్ప, జనసేన రమేష్, సీపీఐ మండల కార్యదర్శి వెంకటరమణ, సూరిబాబు, నాగేంద్ర, గంగాధర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుచ్చెపు చంద్ర, కాంగ్రెస్ మైనార్టీ నాయకులు గౌస్‌బాషా పాల్గొన్నారు.

అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి



గాండ్లపెంట డిప్యూటీ తహీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

గాండ్లపెంట: శ్రీకృష్ణపై రాప్తాడు సిద్ధం సభలో దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని విపక్షం నాయకులు, పాత్రికేయులు డిమాండ్ చేశారు. మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ రవికి వినతిపత్రం అందించారు. మండలకేంద్రంలో విపక్షనాయకులు, పాత్రికేయులు ర్యాలీచేశారు. పలువురు మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్‌పై దాడిచేసిన వారినివెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ప్రజాస్వామ్యంలో పాత్రికేయులపై దాడి చేయడం అమానుషమన్నారు. రాష్ట్రంలో గూండాల అధికారం నడుస్తోందన్నారు. ముఖ్యమంత్రి సమక్షంలోనే వైసీపీ రౌడీమూకలు ఫొటోగ్రాఫర్‌పై దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం ఖాదర్‌బాషా, సీపీఐ శ్రీరాములనాయుడు, టీడీపీ ఆనంద్, అక్రమ్, యూనీస్, రమణారెడ్డి, రవీంద్రారెడ్డి, అస్రప్‌వలీ, నరసింహులు, చంద్ర, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న విపక్ష నాయకులు

ఓబుళదేవరచెరువు: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదని విపక్షం నాయకులు అన్నారు. మంగళవారం ఓడీసీ కదిరి హిందూపురం ప్రధాన రహదారిపై అంబేడ్కర్ సర్కిల్ వద్ద విపక్ష నాయకులు ఫొటోగ్రాఫర్‌పై దాడిచేసినవారిని అరెస్టు చేయాలని రాస్తారోకో చేశారు. జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త పత్తిచంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు బూదిలి ఓబులరెడ్డి మాట్లాడుతూ రాప్తాడు సిద్ధం సభలో వైసీపీ రౌడీముకలు విచక్షణరహితంగా శ్రీకృష్ణపై దాడిచేయడం దారుణమన్నారు. దాడి జరిగి రెండు రోజులవుతున్నా దాడిచేసినవారిని అరెస్టు చేయకపోవడం శోచనీయమన్నారు. అనంతరం ముఖ్యమంత్రికి మంచిబుద్ధిని ప్రసాధించాలని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు మేకల ఈశ్వర్, సీఐటీయూ మండల కార్యదర్శి శ్రీరాములు, సీపీఎం వెంకటరమణ, కాంగ్రెస్ రామాంజనేయులు, మైనార్టీ షబ్బీర్, మీసేవ సుధాకర్, మల్లాపల్లి మల్లికార్జున, జనసేన నాయకులు శ్రీనివాసులు, కొండబోయన సతీష్, శంకర్, దివాకర్‌రెడ్డి, ఉపేంద్ర, నరేంద్ర, అంజి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

దాడికి నిరసనగా ర్యాలీ

నంబులపూలకుంట: శ్రీకృష్ణపై దాడికి నిరసనగా మంగళవారం మండ కేంద్రంలోని నాగలకట్ట కూడలి నుంచి పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం విపక్షం నాయకులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దాడికి పాల్పడినవారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పత్రికా స్వేచ్ఛకు కలిగించరాదన్నారు. మీడియాపై దాడులు చేయడం ఏంటని ప్రశ్నించారు. అనంతర తహసీల్దార్ నరేంద్రకుమార్‌కు వినతిపత్రం అందించారు. నిరసనలో టీడీపీ కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, దండే రవి, నరసింహులు, శ్రీరాములనాయుడు, పోలరెడ్డి, విజయకుమార్‌యాదవ్, గంగశేఖర్, వంకమద్దిరవి, గంగులప్ప, రాజశేఖర్‌యాదవ్, మౌలాసాబ్, రాహులాల్‌బాబా, బాలాజీ, మహేంద్రనాయుడు, ఉమేష్‌యాదవ్, రామిరెడ్డి, ఆదినారాయణ, వెంకటరెడ్డి, బీజేపీ రామమోహన్; ఇంతియాజ్, జనసేన చౌదరి, బాలాజీ, సోమశేఖర్, భాస్కర్, శ్రీరాములు, చౌడప్ప, రాము, భాను ప్రకాష్, సురేష్, సీపీఎం, రైతు సంఘం నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా దాడులు



మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ, నాయకులు

ధర్మవరంరూరల్: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వైసీపీ రౌడీమూకలను కఠినంగా శిక్షించాలని టీడీపీనాయకులు మాజీ జడ్పీటీసీ మేకలరామాంజినేయులు, మాజీ కౌన్సిలర్ తలారిచంద్రమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని అంజుమన్‌సర్కిల్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ సిద్ధం సభకు కవరేజ్‌కు వెళ్లిన శ్రీకృష్ణపై విచక్షణారహితంగా దాడిచేయడం బాధాకరమన్నారు. జగన్‌రెడ్డి పరిపాలనలో ఇష్టారాజ్యంగా దాడులు పెరిగిపోయాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చిన్నూరుబత్తలపల్లి భాస్కర్‌చౌదరి, కామిరెడ్డిపల్లి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: పాత్రికేయులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని మండలపాత్రికేయుల డిమాండు చేశారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడికి నిరసనగా మంగళవారం మండలపాత్రికేయులు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి సీఎస్‌డీటీ శారదాకు, పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ సోమశేఖర్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, మల్లికార్జున, నాగరాజు, రాధాక్రిష్ణ, అజయ్‌నాయుడు, హరిక్రిష్ణ, కృపాకర్, రాజా పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలని వినతి



సీఎస్‌డీటీకి వినతి పత్రం ఇస్తున్న పాత్రికేయులు

వైసీపీ నుంచి టీడీపీలోకి...



టీడీపీలో చేరినవారితో కందికుంట

కదిరి, ఫిబ్రవరి 20: పట్టణంలోని 18, 19 వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ ముంతాజ్ తజ్మల్, ఆమె భర్త తజ్మల్ వైసీపీ వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మంగళవారం కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో పార్టీలో చేరారు. చేరినవారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. వారితోపాటు 50 బీడీ కార్మిక కుటుంబాలు చేరారు. చేరిన వారిలో రహంతుల్లా, జబ్బార్, నౌషాద్, లింగమయ్య, మహమ్మద్ తదితరులున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీఏ ఫారూక్, ఎస్‌బీ శీనా, ఇస్మాయిల్, పలువురు టీడీపీ నాయకులున్నారు.

ప్రతిపక్షాలను తిట్టడమే ముఖ్యమంత్రి పని

ప్రతిపక్షాలను తిట్టడమే ముఖ్యమంత్రి జగన్ పని అని కందికుంట విమర్శించారు. తాను చేసిన పనులు చెప్పకుండా ప్రతిపక్షాలను తిట్టడమే జగన్ పెట్టుకున్నారని, ఆయన పథకాలపై ఆయనకే విశ్వాసం లేదన్నారు. ఐదేళ్ల కాలంలో కరెంటు బిల్లులు పెంపు, అమ్మఒడి, పోలవరం తదితరాల్లో ఎన్ని పరిష్కరించారని ప్రశ్నించారు. కదిరి నియోజకవర్గంలో చెర్లోపల్లి డ్యామ్‌ను పూర్తి చేసింది తామేనన్నారు. వచ్చే ఎన్నికల్లో పెద్దఎత్తును ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కుటాగుళ్ల శంకర్, కేబీ నాగప్ప, మహమ్మదాలి, ఖతాబ్, క్రిష్ణమూర్తి తదితరులున్నారు.

కందికుంటను కలిసిన బీజేపీ నాయకులు

నంబులపూలకుంట: బీజేపీ నాయకులు మంగళవారం కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు షేక్ బాబ్‌జాన్, మరికొమ్మదిన్నె కొవ్వూరి రమణ కందికుంటను కలిశారు. వారితోపాటు టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, రామాంజులు, పోల్‌రెడ్డి, మౌలాసాబ్, మహేంద్రనాయుడు ఉన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

గాండ్లపెంట, ఫిబ్రవరి 20: మండలకేంద్రంలో చేపట్టిన బాబుష్యూరిటీ-భవిష్యత్తుగ్యారెంటీని టీడీపీ నాయకులు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. ప్రతిఒకరూ రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అనంతరం ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగరాజు, సిద్ధారెడ్డి, ఆనంద్, అక్రమ్, రవీంద్రారెడ్డి, రియాజ్, ఫయాజ్ పాల్గొన్నారు.

వైసీపీ పతనం ఖాయం



బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 20: రాష్ట్రంలో అరాచక, విధ్వంస పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వ పతనం ఖాయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ పేర్కొన్నారు. టీడీపీ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం 10వ వార్డులో బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి మినిమేనిఫెస్టో పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఫ్యాన్‌రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా, పరిటాల శ్రీరామ్‌ను ఎమ్మెల్యే చేసుకుందామన్నారు. ప్రజలు ఆదరించాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బీరేగోపాలక్రిష్ణ, టీడీపీ నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, శీలామూర్తి, తలారి చంద్రమోహన్‌బాబు, చింతపులుసు పెద్దన్న, అంబటిసనత్, రాళ్లపల్లిషరీఫ్, అత్తార్‌రహీంబాషా, మాదన సుబ్బయ్య, తెలుగుమహిళలు మాదనమహేశ్వరి, స్వర్ణకుమారి, శారద, నాగరత్న, మీనాక్షమ్మ, మున్ని, చౌడమ్మ, అఖిలమ్మ, భాను, యశోద, వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

ధర్మవరంరూరల్: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని, వచ్చే ఎన్నికల్లో ధర్మవరం ఎమ్మెల్యేగా పరిటాల శ్రీరామ్‌ను, చంద్రబాబునాయుడును సీఎం చేసుకుంటే అన్నివర్గాలను ఆదుకుంటారని ధర్మవరం మండల టీడీపీ నాయకులు పేర్కొన్నారు. బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీని మంగళవారం మండలంలోని గొల్లపల్లి, బడన్నపల్లి గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ఇచ్చిన ప్రతిహామీని అమలుచేయడం జరుగుతుందన్నారు. ధర్మవరంలో పరిటాలశ్రీరామ్ అండతో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలకన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, సీనియర్ నాయకులు గొట్లూరు శ్రీనివాసులు, విజయసారథి, తలారివెంకటలక్ష్మీ, సర్పంచ్ ముత్యాలప్పనాయుడు, పాళ్యం వెంకటేష్, అమరేంద్ర, అనిల్‌గౌడ్, బడన్నపల్లి క్రిష్ణ, రామాంజి, జనార్ధన్, కాటమయ్య, పారేస్, లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, ఆదిరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం



కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు

తాడిమర్రి, ఫిబ్రవరి 20: రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ కూచి రామ్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం తాడిమర్రి మండలంలోని బంగారంపేట మోదులకుంట గ్రామాల్లో బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఘురాంచౌదరి, ముంటిమడుగు హర్ష, రామానాయుడు, పాపానాయుడు, ధనుంజయ, విశ్వనాథ్, యల్లప్ప, గంగయ్య పాల్గొన్నారు.

ముదిగుబ్బ: వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని మర్తాడు, దామానుపల్లి గ్రామాలలో మంగళవారం బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ నిర్వహించారు. కార్యక్రమంలో ముదిగుబ్బ మండల కన్వీనర్ కరణంప్రభాకర్, సూర్యశేఖర రాజు, కనుమ చంద్ర, కోట్లబాబీ, మహబూబ్ పీరా, ఆనంద్, చికెన్ తిరుపాల్, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కన్నుల పండుగగా భీష్మ ఏకాదశి వేడుకలు

పాల్గొన్న పరిపూర్ణానంద స్వామి



పూజలు నిర్వహిస్తున్న పరిపూర్ణానందస్వామి

బుక్కపట్నం, ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశిని మంగళవారం మండలకేంద్రంలోని చౌడేశ్వరీ దేవాలయంలో కన్నులపండుగగా నిర్వహించారు. చౌడేశ్వరీ దేవిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు చేశారు. కాకినాడకు చెందిన పీఠాధిపతులు పరిపూర్ణానందస్వామి చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగలక్ష్మీరాజు, కమిటీ సభ్యులు నాగభూషణం, గుర్రప్ప, చంద్రశేఖర్, క్రిష్ణ పాల్గొన్నారు.

హిందూపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా: పరిపూర్ణానంద

రాయలసీమలో వెనుకబడిన హిందూపురం పార్లమెంటు పరిధిని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి తనవంతు కృషి చేస్తానని పరిపూర్ణానంద స్వామి పేర్కొన్నారు. ప్రజలకు సేవచేయాలన్న ఉద్దేశంతో రాజకీయంగా అడుగులు వేసే నిర్ణయం తీసుకున్నామన్నారు.

ఎన్నికల నియమావళిని అమలు చేయాలి: కలెక్టర్

పుట్టపర్తి, ఫిబ్రవరి 20: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలు దృష్టిలో ఉంచుకుని ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేలా విధులు నిర్వహించాలన్నారు. సరిహద్దులో తనిఖీ కేంద్రాలవద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, నగదు, తరలింపుపై నిఘా ఉంచాలన్నారు. కేసుల నమోదు విషయంలో బోర్డ్‌ఆఫ్ కండక్ట్ ప్రకారం వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ కొండయ్య, ఆర్‌డీఓ భాగ్యరేఖ, వంశీకృష్ణ, వెంకటశివరాంరెడ్డి, మాస్టర్ ట్రైనర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితాకు సహకరించండి: ఆర్డీఓ

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 20: తప్పుల్లేని ఓటరు జాబితాకు అన్ని రాజకీయపార్టీలు సహకరించాలని ఈఆర్ఓ ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆయన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీ నాయకుల ప్రతినిధులతో ఓటర్ల జాబితాపై సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని, పొరపాట్లుకు తావివ్వకుండా ఓటరు జాబితాను తయారుచేయాల్సిన బాధ్యత బీఎల్‌ఓలకు, బీఎల్ఏలకు ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాంబాబు, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, డీఏఓ రమేష్‌బాబు, టీడీపీ, వైసీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

హరిహరక్షేత్రంలో యజ్ఞం

పుట్టపర్తి, ఫిబ్రవరి 20: జిల్లా కేంద్రంలోని ఎనుములపల్లిలో నూతనంగా నిర్మించిన హరిహర క్షేత్రంలో మంగళవారం వేద పండితులు యజ్ఞాన్ని ప్రారంభించారు. మొదట గణపతి హోమంతో యజ్ఞాన్ని ప్రారంభించారు. వెంకటేశ్వరస్వామి, విశ్వేశ్వరుడు, అన్నపూర్ణేశ్వరి, లక్ష్మీహోమాన్ని నిర్వహించారు.

రాష్ట్ర కార్యవర్గంలో చోటు

పుట్టపర్తి, ఫిబ్రవరి 20: భీమవరంలో జరిగిన ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శిగా రామ్మోహన్, రాష్ట్ర ఆర్థిక కమిటీ మెంబర్‌గా శ్రీనివాసులును ఎంపిక చేసినట్లు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కోనంకి చంద్రశేఖర్ తెలిపారు. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం వారు చేస్తున్న పోరాటాలను గుర్తించి రాష్ట్ర కార్యవర్గంలో ప్రాధాన్యత కల్పించినట్లు పేర్కొన్నారు.

'నా సేన కోసం.. నావంతు' విజయవంతం చేయండి

జనసేన పార్టీరాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం, ఫిబ్రవరి 20: నా సేన కోసం నా వంతు కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి విజయవంతం చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ధర్మవరం పట్టణ, రూరల్, బత్తలపల్లి మండలాలకు సంబంధించిన బూత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని గద్దె దించడానికి ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేయాలన్నారు.

జయప్రదం చేయండి

పుట్టపర్తి రూరల్, ఫిబ్రవరి 20: చట్టసభల్లో బీసీలకు సముచిత స్థానమే లక్ష్యంగా పట్టణంలోని శిల్పారామంలో నిర్వహించే బీసీల అఖిల పక్ష ఐక్యతా సమావేశాన్ని జయప్రదం చేయాలని జిల్లా బీసీసంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు సామకోటి ఆదినారాయణ పిలుపినిచ్చారు. మంగళవారం జిల్లా బీసీసంక్షేమసంఘం అధ్యక్షుడు నామాల శంకర్‌తో కలసి మాట్లాడుతూ కార్యక్రమానికి పెద్దఎత్తున పార్టీలతీతంగా బీసీలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపినిచ్చారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేద్దాం: డీఎంహెచ్ఓ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 20: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మార్చిలో నిర్వహిస్తున్నామని, సమష్టిగా పనిచేసి విజయవంతం చేద్దామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి వైద్యసిబ్బందికి సూచించారు. మంగళవారం జిల్లావైద్యాధికారి కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి డివిజన్‌పరిధిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేసే వైద్యసిబ్బందితో పల్స్‌పోలియో సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ కృష్ణయ్య, డిప్యూటీ డెమో బాబాఫక్రుద్దీన్, డీసీహెచ్ఎస్ఓ వీరమ్మ, సీహెచ్ఓ కేపీ కుమార్‌రెడ్డి, హెల్త్‌ఎడ్యుకేటర్ చంద్రానాయక్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారం కోసమే సింహగర్జన '

తనకల్లు, ఫిబ్రవరి 20: ఈనెల 25న కదిరిలో నిర్వహిస్తున్న బంజారాల సింహగర్జన సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కాలేనాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని కొక్కంటి క్రాస్‌లో బంజారా సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండలాధ్యక్షుడు ఉత్తన్న, ప్రభాకర్‌నాయక్, శ్రీరాములనాయక్, రామూర్తినాయక్, జనార్దన్‌నాయక్, మహేష్‌నాయక్, కొండప్పనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం హలో బంజారా.. చలో కదిరి పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో బంజార సంఘం జిల్లా కమిటీ నాయకులు కాలేనాయక్, రాంప్రసాద్‌నాయక్, రమణనాయక్ పాల్గొన్నారు.

ముస్లింలకు అన్యాయం: టీడీపీ

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 20: వైసీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ హిందూపురం పార్లమెంట్ మైనార్టీ ప్రధాన కార్యదర్శి నాగూర్‌హుస్సేన్ పేర్కొన్నారు. మండలంలోని పోతుకుంటకాలనీలో మంగళవారం ముస్లిం నాయకుల ఆధ్వర్యంలో యాసిన్‌నూర ఫొటోలను ముస్లింల ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ సూచనల మేరకు కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముస్లి మైనార్టీ సెల్ అధ్యక్షుడు అత్తర్‌రహింబాష, మైనార్టీనాయకులు రాళ్లపల్లిషరీఫ్, టీడీపీ నాయకులు పోతుకుంట రమేష్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

తనకల్లు, ఫిబ్రవరి 20: మండలంలోని బీమ్లానాయక్ తండాకు చెందిన బ్యాకే రామాంజులనాయక్ కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా మంగళవారం పెద్దపల్లి గ్రామం వద్ద పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్దనుంచి 125 టెట్రా ప్యాకెట్లుతోపాటు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధరణీబాబు తెలిపారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు బాటలు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

బత్తలపల్లి, ఫిబ్రవరి 20: చంద్రబాబునాయుడు సీఎం అయితే భవిష్యత్ తరాలకు బాటలు వేస్తాడని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కోడేకండ్ల, కట్టకిందపల్లి, సూర్యచంద్రపురం గ్రామాల్లో టీడీపీ నాయకులు బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చల్లా శ్రీనివాసులు, మండల కన్వీనర్ నారాయణరెడ్డి, జక్కంపూటి నాగభూషణ, గంటాపురం జగ్గు, తాళ్లూరి సతీష్, సురేంద్రనాయుడు, ఉమాపతినాయుడు, రవి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి ప్రజాస్వామ్యంపై దాడే

పుట్టపర్తిరూరల్: సిద్ధం సభలో ఫోటోలు తీస్తున్న ఆంధ్రజ్యోతిస్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని టీడీపీ, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని హనుమాన్ కూడలిలో టీడీపీ జిల్లాకార్యదర్శి సామకోటి ఆదినారాయణ, జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి అబ్దుల్‌అబూ ఆధ్వర్యంలో క్యాండిల్ శాంతిర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీకృష్ణపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేసి శ్రీకృష్ణకు న్యాయం చేయాలన్నారు. ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడిచేయడం తగదన్నారు. విలేకరులతో రక్షణ లేకపోతే సామాన్యప్రజల పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకులు కొత్తపల్లి జయప్రకాష్, బేకరినాయుడు, పాపారెడ్డి, టీఎస్‌టీయూసీ నాయకులు రామాంజినేయులు పాల్గొన్నారు.

ధర్మవరంరూరల్: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గుండాలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని వెంటనే దాడిచేసిన దుండగులను అరెస్టుచేసి కటాకటాల్లోకి నెట్టి కఠినంగా శిక్షించాలని ఆర్‌యూఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిక్కిలిమహేష్ డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం నాయకులు చిన్నబాబావలి, పవన్, పోతలయ్య, అశోక్‌కుమార్ తదితరులు దాడిని ఖండించారు.

'ప్రజలను రుణ విముక్తులను చేయాలి'

కదిరిలీగల్, ఫిబ్రవరి 20: బ్యాంక్ ద్వారా రుణాలు పొందిన సామాన్యులను లోక్‌అదాలత్ ద్వారా రుణవిముక్తులు చేయడానికి అధికారులు సహకరించాలని, మండల న్యాయాధికారి సేవా సంస్థ చైర్‌పర్సన్, న్యాయాధికారిని ఎస్ జయలక్ష్మీ, న్యాయాధికారిని ప్రతిమ పేర్కొన్నారు. మార్చి 9న జరిగే జాతీయ లోక్‌అదాలత్ ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించడానికి స్థానిక బ్యాంక్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. న్యాయవాదుల సంఘం సభ్యులకు, బ్యాంక్ అధికారులతో సమీక్షించారు. బ్యాంకుల ద్వారా అప్పులు చేసి, తరువాత పరిస్థితుల వల్ల అప్పుచెల్లించలేనివారికి లోక్ అదాలత్‌ద్వారా పరిష్కారానికి సహకరించాలన్నారు. అలాంటివారి జాబితాలను బ్యాంక్ అధికారులు సిద్ధం చేయాలని సూచించారు. బ్యాంక్‌లు కూడా ప్రజాన్యాయస్థానంలోని సదుపాయాలను ఉపయోగించుకోవాలన్నారు.

చంద్రమౌళీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


నరసింహస్వామి అలంకరణలో కొలువుదీరిన చంద్రమౌళీశ్వరస్వామి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 20: పట్టణ సమీపంలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో మాఘమాసం పురస్కరించుకొని స్వామిని నాణ్యాల ఆలంకరణతో కొలువుదీర్చారు. మాఘమాసం 11వ రోజు పురస్కరించుకుని స్వామి వారికి ఉదయం నుంచే అభిషేకాలు, అర్చనలు, విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయంలో ఆకుపూజ చేశారు. అభయ ఆంజనేయస్వామి ఆలయం తోపాటు వివిధ ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.

11 ఆలయాల్లో విష్ణుసహస్రనామ పారాయణం

మడకశిరటౌన్, ఫిబ్రవరి 20: భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని మంగళవారం మడకశిర పట్టణంలోని 11 దేవాలయాల్లో డాక్టర్ శ్రీరంగం శ్రీనివాస్ వాసవీ మహిళా మండలి, భక్తబృందం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణను ఘనంగా నిర్వహించారు. ఉదయం 5.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణంలోని కోట వెంకటేశ్వర స్వామి, ఊరిమారమ్మ, భోగ రామలింగేశ్వరస్వామి, షిరిడీసాయిబాబా, ముత్యాలమ్మ, ఆంజనేయస్వామి, కన్యకాపరమేశ్వరి తదితర దేవాలయాల్లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భీష్ముడి చిత్రపటాన్ని పల్లకిలో ఉంచి పట్టణంలోని ప్రధాన రహదారిలో ఊరేగించారు. ఈకార్యక్రమంలో అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

జలకవనం పోస్టర్ల విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

మడకశిరటౌన్, ఫిబ్రవరి 20: రాయలసీమ జిల్లాలో నీటి సమస్యలపై మార్చి 3వతేదీన సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో కవి సమ్మేళన కార్యక్రమాన్ని పెనుకొండ పట్టణంలోని గగన్ మహల్‌లో నిర్వహిస్తున్నట్లు సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ హరి తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం సంబంధిత వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. నీరు పర్యావరణానికి ప్రధాన వనరులు, రాయలసీమ సస్యశ్యామలం తదితర అంశాలపై కవిసమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కవులు పాల్గొని తమ అమూల్య సందేశాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ శివన్న, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న


మంజునాథ్ కుంటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

మడకశిర రూరల్, ఫిబ్రవరి 20 : అధైర్యపడకండి.. అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న టీడీపీ శ్రేణులకు సూచించారు. మండలంలోని గౌరిపురం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మంజునాథ్ కొద్ది రోజుల క్రితం ఆనారోగ్యంతో మృతిచెందారు. అప్పట్లో మాజీ ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడంతో అక్కడికి వెళ్లలేక పోయారు. దీంతో ఆయన మంగళవారం సాయంత్రం ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు... ఈ సందర్భంగా ఈరన్న మాట్లాడుతూ టీడీపీ బలం కార్యకర్తలే అని, వారికి పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట మండల మాజీ కన్వీనర్ రామాంజనేయులు, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్, నాగరాజు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొడుకుపై అలిగి తండ్రి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఫిబ్రవరి 20: మండలంలోని గంగాదేవి పల్లికి చెందిన నారాయణప్ప తన కుమారుడిపై అలిగి క్రిమిసంహారక మందు తాగి మంగళ వారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఏదో పనినిమిత్తం వెళ్లాలని ద్విచక్ర వాహనం ఇవ్వాలని నారాయణప్ప అతడి కుమారుడిని అడిగాడు. అయితే తనకు పని ఉందంటూ కుమారుడు నిరాకరించడంతో తండ్రి మనస్తాపానికి గురైనట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఇంట్లో మేకల కోసం ఉంచిన క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అస్వస్థతకు గురైన నారాయణప్పను గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం హిందూపురం తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 20 : కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలించి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసిన ట్లు హెడ్ కానిస్టేబుల్ దాదాపీర్ తెలిపారు. మండలంలోని అడదాకులపల్లిలో అదే గ్రామానికి చెందిన అతడు కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు మంగళవారం సమాచారం రావడంతో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి 14 టెట్రాప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టమోటాల వాహనం బోల్తా


బుళ్లసముద్రం వద్ద బోల్తా పడిన బొలేరో వాహనం

మడకశిర రూరల్, ఫిబ్రవరి 20 : మండలంలోని బుళ్లసబుద్రం గ్రామ సమీపంలో మంగళవారం ఉదయం టమోటా లోడుతో వెళుతున్న ఓ బొలేరో వాహనం అదుపు తప్పి రో డ్డు పక్కన బోల్తాపడింది. అమరాపురం మండలం నుంచి హిందూపురం మార్కెట్‌కు బొలేరో వాహనంలో టమోటా తీసుకెళ్తున్నారు. బుళ్లసముద్రం గ్రామ సమీపంలో రోడ్డుపై వేగంగా వెళ్తున్న వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. అందులో ఉన్న వారు సురక్షితంగా బయటపడ్డారు. కింద పడిన టమోటాలను మరో వాహనంలోకి లోడ్ చేసి తీసుకెళ్లారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

పాత్రికేయులు, పలు సంఘాలు, పార్టీల డిమాండ్



లేపాక్షిలో పోలీసులకు ఫిర్యాదు అందజేస్తున్న పాత్రికేయులు

రాప్తాడులో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని పాత్రికేయులతోపాటు వివిధ సంఘాలు, పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

లేపాక్షి, ఫిబ్రవరి 20 : మండలకేంద్రంలో మంగళవారం పాత్రికేయులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లేపాక్షిలోని ఏకశిలా నంది విగ్రహం నుంచి ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ సర్కిల్‌లో నిరసనతెలిపారు. ప్రభుత్వానికి, అల్లరి మూకలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయ కులు మాట్లాడుతూ... విధినిర్వహణలో ఉన్న ఫొటోగ్రాఫర్‌పై దాడిచేయ డం ఏంటని ప్రశ్నించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మీడియాకు స్వేచ్ఛలేకుండా పోయిందన్నారు. వాస్తవాలు, నిజాలు రాస్తే పాత్రికేయులపై వైసీపీ రౌడీలు దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. మూడు రోజులు అవుతున్నా దాడిచేసిన నిందితులను అరెస్ట్ చేయక పోవడం సిగ్గుచేటన్నారు. శ్రీకృష్ణపై దాడికి పాల్పడ్డ వైసీపీ రౌడీలపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలన్నారు. బేషరతుగా పాత్రికేయులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తీసుకురావాలన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే న్యాయస్థానం కల్పించుకుని పాత్రికేయులకు రక్షణగా కఠిన చట్టాలు తేవాలని న్యాయస్థానాన్ని కోరారు. ప్రస్తుత తరుణంలో మీడియా వ్యవస్థ లేకపోతే సమాజంలో ఏం జరిగేదో ఊహించుకోనేందుకే భయమేస్తోందన్నారు. కార్యక్రమంలో పాత్రికేయులు గోవర్ధన్‌బాబు, ఆనందప్ప, శివకుమార్, ప్రభాకర్‌రెడ్డి, సందీప్, నాగభూషణం, నాగేంద్ర, అశోక్‌లు, అఖిల పక్షం నాయకులు టీడీపీ మండల కన్వీనర్ జయప్ప, కాంగ్రెస్ రామాంజినేయులు, సలావుద్దీన్, బీజేపీ భద్రి, నరసింహమూర్తి, సీపీఐ శివప్ప, సీపీఎం ప్రవీణ్, నరసింహులు, అఖి, ఏఐఎస్ఎఫ్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ బాబావలి, ఈడిగ చంద్ర, శ్రీరామిరెడ్డి, శెక్షావలి, రవి, గంగన్న, సంజీవప్ప, నరసింహప్ప, బాబు పాల్గొన్నారు.


తహసీల్దార్ వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు

మడకశిరటౌన్: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని మండలంలోని పాత్రికేయులు మంగళవారం అమరాపురం తహసీల్దార్ వెంకటసుబ్బయ్యకు వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ... జర్నలిస్టులపై దాడులు జరుగుతున్నా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. శ్రీకృష్ణపై దాడిచేసిన వారిపై వెంటనేచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విలేకరులు శివాచారి, సిద్దేశ్వర్, భరత్, నాగరాజు, మల్లికార్జున, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.



డీటీ మహబూబ్‌పీరాకు వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు

గుడిబండ : ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వైసీపీ మూకలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని మండంలోని జర్నలిస్టులు నన్నలింగప్ప, షబ్బీర్, రంగనాథ్, తిమ్మప్ప, శివన్న, తిప్పేస్వామి, అంజన్‌నాయుడు డిమాండ్ చేశారు. వారు మంగళవారం గుడిబండలో ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్‌పీరాకు విన్నవించారు. శ్రీకృష్ణపై దాడిచేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఫొటో జర్నలిస్టుపై దాడి హేయమైన చర్య

నిందితులను శిక్షించాలని జనసేన డిమాండ్


తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న జనసేన నాయకులు

చిలమత్తూరు, ఫిబ్రవరి 20: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ నాయకులు దాడి చేయడం హేయమైన చర్యఅని, దానిని ప్రతి ఒక్కరు ఖండించాలని జనసేన పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఫొటో గ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ జనసేన పార్టీ నాయకులు చిన్న ప్రవీణ్, ఏవీ రమణ, వెంకట శివ, లక్ష్మణమూర్తి, హరి, జయచంద్ర, రంగనాథ్ తదితరులు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం నిరంకుశ పాలన చేస్తోందన్నారు. ఈ ప్రభుత్వానికి నచ్చని వారిపై దాడులకు పూనుకుంటోందన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటివి ఎంతో కాలం సాగవన్నారు. ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

దాడిచేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలి

జడ్పీటీసీ ఉమేష్

అగళి, ఫిబ్రవరి 20 : ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి అమానుషమని, దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ ఉమేష్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో విలువలతో కూడుకున్న రాజకీయాలు లేవన్నారు. రౌడీయిజం, గూండాయిజం ఉన్నవారే రాజకీయాలు చేయాలేమో అనిపిస్తోందన్నారు. వాస్తవాలను పత్రికల్లో ప్రచురించేందుకు వెళ్లిన వారిపై దాడిచే యాల్సిన అవసరం ఏముందన్నారు. ప్రజలందరూ ఇది గమనిస్తున్నారన్నారు. మూడునెలలు దాటితే వైసీపీ మూలాన పడుతుందన్నారు. అప్పుడు వారి పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ప్రజలే చూస్తారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కుమారస్వామి, బీసీ సెల్ నాయకుడు తిప్పేస్వామి, నాయకులు శ్రీనివాసులు, శివకుమార్, రవికుమార్, కర్రెన్న, నాగరాజు, శివన్న, రామచంద్రారెడ్డి, శివలింగప్ప, నాగోజీ, దినేష్, రాజు, మంజునాథ్ తదితరులు ఉన్నారు.

గుడిబండ: ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకలు దాడిచేయడం అమానుషమని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు మంజునాథ్ ఖండించారు. సిద్ధం సభకు కవరేజ్ కోసం వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిచేయడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. దాడిచేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయండి: బీకే


బీదానిపల్లిలో టీడీపీ నాయకులతో సమీక్షిస్తున్న బీకే పార్థసారథి

రొద్దం, ఫిబ్రవరి 20 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. ఆయన మంగళవారం రొద్దం మండల పరిధిలోని ఆర్ మరువపల్లిలోని బీకే స్వగృహంలో, బీదానిపల్లిలో టీడీపీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీకే మాట్లాడతూ.... టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఐకమత్యంగా ఉంటూ అందరి నీ కలుపుకుంటూ పార్టీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఎన్నికల కు సమయం సమీపిస్తున్న కారణంగా ఎవరికి వారు గ్రామాల్లో ప్రజలను టీడీపీ వైపు తిప్పుకునేలా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజు, వెంకటేశు, నాగభూషణప్ప, బీదానిపల్లి టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ

రొద్దం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఈడిగ భీమయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా బీకే పార్థసారథి మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య సమస్యలపై ఆరాతీశారు. టీడీపీ మండల కన్వీనర్ నరహరి, చంద్రశేఖర్, రామాంజి, రాజప్ప, పెద్ద చిక్కలప్ప, శ్రీనివాసులు, అశ్వత్థనారాయణ, మురళి, నాగ తదితరులు పాల్గొన్నారు.

'చంద్రబాబును సీఎం చేద్దాం'

అగళి, ఫిబ్రవరి 20 : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిని చేసుకుందామని, అందుకు ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేయా లని మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు సునీల్ సూచించారు. ఆయన మంగళవారం అగళి మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా జీవించేవారని అయితే ప్రస్తుతం బిక్కుబిక్కు మంటూ భయంగా కాలం గడుపుతున్నారన్నారు. దౌర్జన్యపరుల చేతిలో అధికారం ఉందన్నారు. అభివృద్ధి చేసిందేమీలేదన్నారు. కానీ ప్రజలకు వారి వారి ఖాతాల్లో నాలుగు కాసులు జమచేసి నేను అభివృద్ధి చేశాను అని చెప్పుకుంటున్న సీఎం జగన్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. పార్టీలో భేదాభిప్రాయాలను పక్కనబెట్టి ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ కన్వీనర్ గోవిందప్ప, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, నాయకులు చిదానందప్ప, అలీఖాన్, నాగోజీ గుండా నాగరాజు, కేతప్ప ఉన్నారు.

టీడీపీ అనుబంధ కమిటీల ఎంపిక

మడకశిరటౌన్, ఫిబ్రవరి 20: టీడీపీ అమరాపురం మండల అనుబంధ కమిటీలను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా ధనుం జయ, ప్రధాన కార్యదర్శిగా రాజశేఖర్, తెలుగు యువత అధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌ను నియమించారు. టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడిగా ఈరన్న, ప్రధాన కార్యదర్శిగా రవిబాబు, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా యంజారప్ప, ప్రధాన కార్యదర్శిగా మురళీధర్, ఎస్సీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా సన్నప్ప, ప్రధాన కార్యదర్శి గా శకునప్పను నియమించినట్లు తెలిపారు. ఎస్టీ సెల్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, తెలుగు మహిళ అధ్యక్షురాలిగా సుజాతమ్మ, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీదేవి, తెలుగురైతు అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, మైనారిటీ విభాగం అధ్యక్షుడిగా దాదాపీర్, ప్రధానకార్యదర్శిగా మోసిన్‌ఖాన్, తదితరులను పార్టీ అధినేత చంద్రబాబునాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియమించినట్లు తెలిపారు.

పిల్లల్లో రోగనిరోధక శక్తి పెంచే చిక్కీలు: సీడీపీఓ

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 20: స్పైరులిన చెక్కిలతో చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెంపొందుతుందని సీడీపీఓ రెడ్డి రమణమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని అప్పలకుంట గ్రామంలో మంగళవారం వాసవీ మహిళా మండలి, విప్రోకేర్ సహకారంతో కుశాల్ హెల్త్‌కేర్ క్లినిక్ వారు అంగన్‌వాడీ పిల్లలకు స్పైరులినా చిక్కీలు అందించారు. ఈ చిక్కీలు తినడంతో పిల్లలు వ్యాధుల బారినపడకుండా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విప్రోకేర్ ప్లాంట్ హెచ్ఆర్ రామకృష్ణారావు, అంగన్‌వాడీ సిబ్బంది, కుశాల్ క్లినిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మండలస్థాయి సైన్స్ ఫెయిర్

రొద్దం, ఫిబ్రవరి 20: మండలకేంద్రంలోని టింబక్టివ్ కలెక్టివ్ సంస్థలో మండలస్థాయి సైన్స్‌ఫెయి ర్‌ను మంగళవారం నిర్వహించారు. చిగురు సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించడానికి, వారిలోని సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్‌ఫెయిర్ ఉపయోగపడుతుం దని చిగురు కోఆర్డి నేటర్ రామన్న తెలిపారు. ఇళ్లలో శాస్త్రీయంగా పరిశోధనలు చేసుకోవ డానికి సైన్స్ ఉపయోగపడుతుందని ఆర్ట్ అండ్ డిజైన్ కోఆర్డినేటర్ అడవి రాముడు పేర్కొన్నారు. మండలంలోని వందమంది విద్యార్థులు 40నమూనాలను ప్రదర్శించారు. సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులకు మెడల్స్, మెమెంటోలు అందజేశారు. మండలంలోని జిల్లాపరిషత్, కేజీబీవీ, మదర్‌హైస్కూల్, దొడగట్ట, రెడ్డిపల్లి, చోళేమర్రి, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధాదేవి, ఆనంద్, మోహన్, శిరీష, రాధిక, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.


సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులు

మధ్యాహ్నం 2 గంటలకే సచివాలయం మూత

నిరాశతో వెనుదిరిగిన రైతులు, ప్రజలు



మధ్యాహ్నం 2 గంటలకే తాళం వేసిన గ్రామ సచివాలయం

రొళ్ల, ఫిబ్రవరి 20: మండల పరిధిలో దొడ్డేరి గ్రామ సచివాలయాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకే మూసివేశారు. దీంతో వివిధ పనులపై వస్తున్న రైతులు, ప్రజలు వాటికి తాళం వేయడం చూసి, నిరాశతో వెనుదిరిగారు. ప్రజలకు అందుబా టులో ఉండి సేవలందించాలని ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అమలు చేస్తోందని, మరి ఆయా కార్యాలయాలను పనివేళల్లో తెరువకపోతే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ సచివాలయం లోని సిబ్బంది సమయానికి హాజరు కారని, సరిగా విధులు నిర్వహించరని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై ఇన్‌చార్జ్ పంచాయతీ సెక్రెటరీ వివరణ కోరగా... సచివాలయంలోని ముగ్గురు సిబ్బంది బీఎల్‌ఓలుగా పనిచేస్తున్నారని తెలిపారు. దీంతో వారు విధులపై బయటకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. సచివాలయంలో సిబ్బంది కొరత ఉందని ఆయన తెలియజేశారు. ఈ కేంద్రానికి అన్ని శాఖల అధికారులను నియమించాలని ఆ గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కార్డుదారులకు బియ్యం పంపిణీ


డీ రామగిరి గ్రామంలో బియ్యం పంపిణీ చేసిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మడకశిర రూరల్, ఫిబ్రవరి 20: మండలంలోని డి రామగిరి గ్రామంలో రేషన్ కార్డుదారుల నుంచి బయోమెట్రిక్ వేయించుకుని, బియ్యం పంపిణీ చేయకపోవడంపై 'అడిగేవారెవరని..' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రచురించిన కథనంతో బాధితులకు న్యాయం చేకూరింది. వారికి బియ్యం పంపిణీ చేశారు. డి రామగిరి గ్రామంలో మొత్తం 96 కార్డులున్నాయి. ఈనెల 15వ తేదీలోపు 78 కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశారు. మిగిలిన 18 మంది కార్డుదారులతో బయోమెట్రిక్ వేయించుకుని, బియ్యం ఇవ్వలేదు. ఎఫ్‌పీ షాపు చుట్టూ వారు ప్రదక్షిణ చేస్తున్నారు. వారి సమస్యపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించడంతో ఆ 18 మంది కార్డుదారులకు మంగళవారం సాయంత్రం బియ్యం పంపిణీ చేశారు.

బీజేపీ ప్రజాపోరుయాత్ర పోస్టర్ల విడుదల


పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 20: బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రజాపోరు యాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రామక్రిష్ణ పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు మంగళవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఆధ్వర్యంలో ఈనెల 21నుంచి నియోజకవర్గంలో ప్రజాపోరు యాత్ర జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలన్నిటికీ బీజేపీ నేతృత్వంలోని కేంద్రం ప్రభుత్వం 75శాతం నిధులు మంజూరు చేస్తోందన్నారు. ఆ నిధులతో చేపట్టిన పథకాలను వైసీపీ అమలు చేస్తున్నట్లుగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంగడి రామాంజనేయులు, రవి, సుభాష్, హనుమంతు, సుబద్రమ్మ, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేద్దాం

జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 20: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మార్చిలో నిర్వహిస్తున్నామని, సమష్టిగా పనిచేసి విజయవంతం చేద్దామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి వైద్యసిబ్బందికి సూచించారు. మంగళవారం జిల్లావైద్యాధికారి కార్యాలయంలోని కాన్ఫరెన్సుహాల్‌లో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి డివిజన్‌పరిధిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేసే వైద్యసిబ్బందితో పల్స్‌పోలియో సన్నాహక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో నిర్మూలనే ధ్యేయంగా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. జిల్లాలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ కృష్ణయ్య, డిప్యూటీ డెమో బాబాఫక్రుద్దీన్, డీసీహెచ్ఎన్ఓ వీరమ్మ, సీహెచ్ఓ కేప కుమార్‌రెడ్డి, హెల్త్ఎడ్యుకేటర్ చంద్రానాయక్ పాల్గొన్నారు.

ఏసీ చొరవతో రైతు సంఘం ధర్నా విరమణ


ఏసీ శివప్పకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పావగడ, ఫిబ్రవరి 20: రైతు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో రెండు రోజులుగా స్థానిక తాలూకా కార్యాలయం ధర్నా నిర్వహిస్తున్నారు. అయితే మధుగిరి ఏసీ శివప్ప మంగళవారం చొరవ తీసు కొని సర్దిచెప్పడంతో వారు ధర్నా విరమించుకున్నారు. అదేవిధంగా కోటగుడ్డంలో ఓ మహిళా రైతు భూమిని ఆక్రమించుకున్న ఓ ప్రైవేట్ సోలార్ కంపెనీ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని ఏసీ శివప్ప హామీ ఇచ్చినట్టు రైతు సంఘం నాయకులు తెలిపారు. అలాగే బగర్‌హుకుం భూములను సాగుచేసిన రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏసీకి అందజేశారు.